క్లుప్తంగా

హిందూ పరిరక్షణకు కృషి
ఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర సహ కన్వీనర్ ఈశ్వరయ్య



చెరుకుపల్లి: మన సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి ఆత్మ వంటివని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహ కన్వీనర్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలోని 13 మండలాల కమిటీ సమావేశం గురువారం గుళ్ళపల్లి శ్రీనూకాలమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ హిందూ పరిరక్షణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అగ్నిహోత్రం శేషాచార్యులు ,జిల్లా మహిళ కన్వీనర్ విజయలక్ష్మీ, జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారయణ, యల్లాప్రగడ సీతాపతి, పడమట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి
చెరుకుపల్లి: గణపతి నవరాత్రుల ఉత్సవాలకు నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని ఎస్సై టి.అనీల్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నవరాత్రి ఉత్సవాలపై గురువారం ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించి శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మార్గదర్శకాలను వివరించారు.

గిరిజనులకు చేయూత
రేపల్లె రూరల్: మండలంలోని బేతపూడి కాలువ కట్టపై జీవిస్తున్న గిరిజనులకు గురువారం తెనాలికి చెందిన ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. ట్రస్ట్ నిర్వాహకురాలు రావూరి అంజలి బియ్యం, వస్త్రాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. భారీ వర్షాలకు గిరిజనుల తాత్కాలిక గుడారాలు కొట్టుకుపోయిన నేపథ్యంలో సాయం అందించామని పేర్కొన్నారు. వరదనీరు వెళ్లిన అనంతరం వారికి ప్లాస్టిక్ పరదాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ యాకోబు, రావూరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



నిజాంపట్నం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వర్షాల వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబు, మండల ఉపాధ్యక్షులు తోటకూర సుబ్బారావు, ఉన్నవ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్ పాల్గొన్నారు.

రిక్షావాలా నెట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొల్లూరు : రిక్షా వాలా నెట్టడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూరులో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఇతర ప్రాంతం నుంచి ఇటీవల కొల్లూరు వచ్చి చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవిస్తున్న వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా స్థానిక జియో షోరూమ్ వద్ద రిక్షా నడుపుకునే వ్యక్తి అతనితో కొద్ది సమయం మాట్లాడాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరగడంతో రిక్షా నడుపుకునే వ్యక్తి నెట్టడంతో తెనాలి-రేపల్లె రహదారిపై పడిపోయాడు. రోడ్డు దెబ్బ తగిలి మధ్యలో పడిపోయిన వ్యక్తిని నెట్టిన రిక్షావాలా పక్కకు లాగి అక్కడి నుంచి జారుకున్నాడు. స్థానికులు గమనించి పడిపోయిన వ్యక్తిని పరిశీలించగా ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వేమూరు సీఐ పి.రామాంజనేయులు, ఎస్ఐ ఏడుకొండలు మృత దేహాన్ని పరిశీలించి, మృతుని వివరాల కోసం విచారణ చేపట్టారు. అతడి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవం



చెరుకుపల్లి : తల్లిదండ్రుల తరువాత గురువులే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వస్తారని, ఉపాధ్యాయులను సత్కరించుకోవటం మంచి సంప్రదాయమని మండల విద్యాశాఖ అధికారులు పులి లాజర్ టి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం మండలంలోని అన్ని పాఠశాల్లో వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు గురువులను సత్కరించారు. ఆరుంబాక పంచాయతీ పరిధిలోని కామినేనివారిపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థులు గంధాభిషేకం, పూలాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఏటా ఈ పాఠశాలలో నవోదయ సీట్లు సాధించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు కాగిత బాపూజీని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సత్కరించారు.



కొల్లూరు మండలం దోనేపూడిలో నీటమునిగిన పసుపు పంట



కొల్లూరు మండలం పెసర్లంకలో వరదకు కోసుకుపోయిన పక్కా గృహంలోని ఓ భాగం



కొల్లూరు మండలం పోతార్లంకలో దుర్వాసన వస్తుండటంతో చెత్తకుప్పలో పడవేసిన భోజనం ప్యాకెట్లు

లంక మేట .. కష్టాల ఈత



కొల్లూరు మండలం పోతార్లంకలో వరదకు కొట్టుకొచ్చిన టీవీ, గృహోపకరణాలు



కొల్లూరు మండలం తిప్పలకట్ట వద్ద వరద నీటిలో పసుపు, కొబ్బరి తోట



కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ముంపునకు గురైన జామ తోట



కొల్లూరు కరకట్ట దిగువున వరద ముంపుకు గురైన వరి పంట

- వీడిన వరద.. ఒండ్రు మట్టి మేట
- రోడ్లపై పేరుకున్న చెత్తాచెదారం
- ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- ఎందుకూ పనికి రాకుండా పోయిన పంటలు



కొల్లూరు మండలం పోతార్లంక సమీపంలో వరద నీటి ప్రవాహ వేగానికి విరిగి పడిపోయిన అరటి చెట్లు

కొల్లూరు/భట్టిప్రోలు/వేమూరు: లంకల్లో బురద మేట వేసింది. ఇళ్లల్లోనూ, రోడ్లపై ఒండ్రు మట్టి పేరుకుపోయింది. కొన్నిచోట్ల గృహాలు కోతకు గురయ్యాయి. ఫలితంగా వరద బాధితులు అష్టకష్టాలు పడుతున్నారు. భట్టిప్రోలు మండలం చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు పల్లెపాలెం గ్రామాల్లో బాధితులు ఇళ్లను బాగుచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇళ్లల్లోని సామగ్రి అంతా పాడైపోవడంతో ఏం చేయాలో పాలుపోక బాధితులు తలలుపట్టుకుంటున్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, సున్నం, దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వరదలకు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. బాధితులను ఆదుకునేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు ముందుకొస్తున్నాయి. ఆహారం, వాటర్ బాటిళ్లు అందిస్తున్నాయి.

ఏపీఎస్ఎస్‌టీఎఫ్ చేయూత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని వరద ప్రభావిత గ్రామాల్లో గురువారం భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని విద్యార్థులకు రూ.40 వేలు వ్యయం చేసే బ్యాగ్‌లు, పెన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్స్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్, కె.శివరామకృష్ణ, హరిప్రసాద్, సుభాని, ఎస్టేట్‌బాబు తదితరులు పాల్గొన్నారు

వరద బాధితులకు ఆహారం

వరద బాధితులకు భోజనం అందించేందుకు విశ్రాంత డీజీపీ మండవ విష్ణువర్ధనరావు మేనల్లుడు వేములపల్లి రాఘవేంద్రరరావు ముందుకు వచ్చారు. భట్టిప్రోలు మండలం పెదలంక మధ్య గూడెం, కృష్ణా జిల్లా ఆముదార్లంక గ్రామాల్లో మూడు రోజులుగా మూడుపూట్ల ఆహారం అందిస్తున్నారు. కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఎస్పీ మండవ దీపిక భర్త విక్రాంత్ పాటిల్ సహాయ సహకారాలు అందజేస్తున్నారు. వరద బాధితులు కోలుకునేంత వరకు సహాయం చేయనున్నట్లు రాఘవేంద్రరరావు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ఆపన్న హస్తం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో 600 మంది వరద బాధితులకు ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు అందచేశారు. బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

నీటి మునిగిన వరి పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేమూరు: చదలవాడ, కాకర్లమూడి గ్రామాల్లో వరి పంట పొలాలను బాపట్ల జిల్లా వనరుల కేంద్రం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ పరిశీలించారు. నీటమునిగిన పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలోవిలేజ్ వ్యవసాయాధికారి విజయకుమార్ రైతులు పాల్గొన్నారు.

రెడ్డి సేవామిత్ర చేయూత

కర్లపాలెం: రెడ్డి సేవామిత్ర అధ్యక్షుడు సంగు గోవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు ఆట్ల వెంకటేశ్వరమ్మ అయ్యప్పరెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి పెదలంక, పెసరలంక గ్రామాలలోని ప్రజలకు గురువారం భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర సభ్యులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న గృహాల నమోదు ప్రారంభం

రేపల్లె రూరల్: పెనుమూడి పల్లెపాలెంలో పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలను గుర్తిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖరరావు చెప్పారు. గురువారం పెనుమూడి పల్లెపాలెంలో నష్టపోయిన గృహాలను సర్వే చేస్తున్న బృందాలతో కలిసి ఆయన వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, సర్వే బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనాలను అందించారు.



కొల్లూరు కరకట్ట దిగువున వరద నీటిలో మునిగి పనికిరాకుండా పోయిన బొప్పాయి పంట

పంట కన్నీరు
భట్టిప్రోలు మండలం వెల్లటూరు కరకట్ట దిగువన వరద నీటిలో మగ్గుతున్న దోస పంట వరద బీభత్సంతో పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి. ఫలితంగా కర్షకులు కన్నీరు పెడుతున్నారు. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని అరటి, దోస, కంద, పసుపు, వరి తదితర పంటలు ఎందుకూ పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పొలాల్లో పంటలను పీకి పారేసేందుకు సమాయత్తమవుతున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరైందని విలపిస్తున్నారు.

– భట్టిప్రోలు/కొల్లూరు



వెల్లటూరు కరకట్ట దిగువన వరద నీటిలో నానుతున్న దోస పాదులు

శుభ్రమస్తు
భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలలోని గదులను శుభ్రం చేసుకునే పనిలో హెచ్‌ఎం ఎస్‌కే మహబూబ్ భాషా, వి.సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుభ్రం చేశారు. మేట వేసిన ఒండ్రును, బురదను తొలగించారు. వారికి విద్యార్థులు సాయం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వరద బాధితుల ఇళ్లను ఫైరింజన్ల సాయంతో శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ.. ప్రభుత్వ పాఠశాలలనూ విద్యాశాఖ అధికారులు శుభ్రం చేయించకపోవడంతో ఉపాధ్యాయులే ఈ పనికి పూనుకోవడం గమనార్హం.



–భట్టిప్రోలు

ప్రకటన

మదర్‌థెరిసా సొసైటీ బాసట



మదర్ థెరీసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షులు పి.ప్రియ స్వప్న భట్టిప్రోలు,, కొల్లూరు మండలాల్లోని చింతమోటు, పెదలంక, గాజులంక, గ్రామాలకు చెందిన 100 మందికి భోజనం, వాటర్‌బాటిళ్లు, దుప్పట్లు అందచేశారు.

పొలాల్లో నిలిచిన నీరు
చెరుకుమిల్లి మండలంలో వరి పొలాలు నీటమునిగాయి. ఈ పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ గురువారం పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. దెబ్బతిన్న పొలాల్లో పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

– చెరుకుపల్లి



గూడవల్లిలో నీటమునిగి సముద్రాన్ని తలపిస్తున్న వరిపొలాలు



భట్టిప్రోలు మండలం పెదలంక మధ్య గూడెం రహదారిపై నిలిచిన వరద నీరు



భట్టిప్రోలు మండలం పెసర్లంక జెడ్పీ హైస్కూల్ ముందు నిలిచిన వరద నీరు



రెడ్డి సేవా మిత్ర సంఘం ఆధ్వర్యంలో సాయం



పెనుమూడి పల్లెపాలెంలో దెబ్బతిన్న గృహాల సర్వే చేస్తున్న అధికారులు



పెసర్లంకలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాయం



పెదలంక మధ్య గూడెంలో భోజనం చేస్తున్న వరద బాధితులు



చదలవాడలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

మొత్తం ఊడ్చుకుపోయింది



ఒక ఎకరం కౌలుకు తీసుకున్నా. నాకున్న ఎకరంన్నరతో కలిపి మొత్తం అరటి పంట వేశాను. వరద వల్ల మొత్తం ఊడ్చుకుపోయింది. కౌలుకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాను. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటో అర్థం కావడంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– దోవా వసంతరావు, పెదలంక, భట్టిప్రోలు మండలం

కట్టుబట్టలతో మిగిలాను



కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఒక ఎకరా రూ.65 వేలు కౌలుకు తీసుకుని అరటి సాగు చేశాను. ఆరుగాలం కష్టించి పని చేసి అప్పో సొప్పో చేసి పంట పండించే యత్నంలో భాగంగా 12 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు రూ.14 వేలు కొనుగోలు చేసి జాగ్రత్త చేస్తే వరదకు కరిగిపోయాయి. ఆరు రోజులుగా కట్టుబట్టతో మిగిలాను.

– జంపని రామయ్య, చింతమోటు, భట్టిప్రోలు మండలం



వరద బాధిత విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

‘ఛిద్ర’వధ
వరద ఉధృతికి రోడ్లు ఛిద్రమయ్యాయి. పలు చోట్ల కోతకు గురయ్యాయి. రాకపోకలకు పనికిరాకుండా పోయాయి. ఫలితంగా లంక గ్రామాల వాసులకు ఇక ‘చిద్ర’హింసలు తప్పేట్టు లేవు.

– కొల్లూరు



కోతకు గురైన లంక గ్రామాలకు వెళ్లే పెసర్లంక రోడ్డు



లంక గ్రామాలకు వెళ్లే మార్గంలో సీఎం పర్యటన నేపథ్యంలో మరమ్మతులు



కొల్లూరు మండలం పెసర్లంక సమీపంలో ధ్వంసమైన రహదారి